# 27. కళోపాసి

ముసలివాడు నాతో అన్నాడు: "అది దినచర్య; అలవాటు - అంతే! ఐతే కొంత మనిషిలో కూడా దానంతటదే అదిగా పుట్టాలి. కాని ముఖ్యంగా కావాల్సింది - సంవత్సరాల తరబడి ప్రతిరోజూ అలవాటు చేసుకోవటమే!"

అతను మాట్లాడిన సౌమ్యమైన విధానం నన్ను ఆశ్చర్యపెట్టింది; ఎందుకంటే - నేను చూసినంత వరకూ ఇతర ఆటగాళ్ల కన్న అతనిలో అద్భుతమైన తెలివితేటలున్నయ్. నేను అతన్ని చాలాసార్లు చూశాను; ఇంకా చాలామంది కూడా ఆతన్ని ఎరుగుదురు. ఎప్పుడూ ఏదో వొక సర్కస్‌లో అతను కనిపిస్తూనే ఉంటాడు. ఒక పెద్ద కొయ్య చెక్కకు ఆనుకొని ఒక ఆడది చేతులుజాచి నిలబడుతుంది. కొంత దూరంనుంచి అతను - ఆమె వేళ్లమధ్యగానూ, తలచుట్టూనూ కత్తులు గుచ్చుకొనేట్టు విసరుతాడు. ఆ వ్యాపార రహస్యం తెలిసినవాళ్లకు ఇందులో 'అద్భుతం' లేదు; కత్తులు పదునైనవి కానూ కావు; అదీకాక అవ్వి 'మాంసం' ఉన్నచోటికి చాలా దూరంలో గుచ్చుకుంటూ ఉంటయ్....కాని వాటిని విసిరే వడీ, ఆ కత్తుల తళతళ మెరుపులూ, అవి గమ్యస్థానం జేరేముందు తిరిగే వంకరలూ - ఇవి ఆపదను సూచించే మామూలు పనులైనా - సుమారైన చాకచక్యానికి లొంగినవే!

కాని యీ ముసలివాని విషయంలోమాత్రం ఇలాటి మోసమేమీ లేదు; మన కళ్లల్లో దుమ్ముకొట్టటమనేది కూడా లేదు. అదంతా చాలా 'సింసియర్'గా చేసేపని. కత్తులు - మంగలికత్తులంత పదునైనవి; ముసలివాడు వాటిని వేళ్లమధ్యగా, తలచుట్టూరా సమానమైన దూరాల్లో మాంసానికి అమిత సమీపంలో గుచ్చుకునేట్టు వేస్తాడు; మెడచుట్టూ 'కాలర్' లాగుకూడా కడతాడు, వీటన్నిటినీ మించింది - అతను కత్తుల్ని విసిరేప్పుడు గమ్యస్థానాన్ని చూడడు. దట్టమైన గుడ్డను నూనెలో తడిపి, దాన్ని తన ముఖానికి అడ్డం వేసుకుంటాడు.

గొప్ప కళోపాసకుల్లాగే అతనూ యీ జనానికి అర్థమవలేదు. ప్రజలు - అతను మోసం చేస్తున్నాడని, అతను కళ్లకు కట్టుకునే గంతలోకూడా ఏదో మోసం వుందనీ అభిప్రాయపడ్డారు.

"మనం వొట్టి తెలివితక్కువవాళ్లమని అతని ఉద్దేశం. అతను కళ్లు మూసుకొని తన గురిని ఏ విధంగా పట్టుకోగలుగుతాడు?" అన్నారు, ప్రజలు.

ఆ గుడ్డలో కనపడేందుకు వీలుగా చిన్నచిన్న కన్నాలున్నయని వారు తలిచారు. తన పనితనాన్ని చూపబొయ్యే ముందు ఆ గుడ్డను ప్రేక్షకులకు చూపటం కూడా లాభంలేనిపని. అందులో మోసమనేది కాదని నిర్ధారణయినా – అతను తమను మోసం చేస్తున్నాడనే వారి అభిప్రాయంలోనే వారికి ఎక్కువ తృప్తి ఉంటుంది. తమను తప్పకుండా మోసం చెయ్యాలని ప్రజల అభిలాష!

ముసలివాడిలో గొప్ప 'కళ' దాగివుందని నేను కనుక్కున్నాను. ఏ విధమైన మోసం చేసేందుకైనా అతను అనర్హుడు. నా అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ నేను ఆ మాటే అన్నాను. అతని విషయంలో నేను చూపిన న్యాయానికీ, నా అభిమానానికీ అతను చలించాడు.

ఈ విధంగా మేము మంచి స్నేహితులమయ్యాం. అప్పుడు అతను నాకు – యీ ప్రజలకు అర్థంకాని వ్యాపార రహస్యాన్ని బైటపెట్టాడు. ఆ రహస్యం ఇది: "స్వతహాగా దానంతట అదే కొంత ఉండాలి..ఆ తరువాత ప్రతిరోజూ ఏళ్ల పర్యంతమూ దాన్ని సాధనచెయ్యాలి..."

అతను మోసం చెయ్యలేదని నేను అన్నప్పుడు – అతను అన్నాడు: "ఔను...అది నాకు అసాధ్యమైన పనే – నేను చెప్పకపోతే అది ఎంత అసాధ్యమో మీరు ఊహించలేరు–కాని, ఏం లాభం?"

అతని ముఖకళ మారింది; కళ్లల్లో నీళ్లు తిరిగినయ్. ఆ రహస్యాన్ని చెప్పమని నేను గట్టిగా అడిగేందుకు సాహసించలేక పొయ్యాను. కాని నా చూపులు, నా నిశ్శబ్దమంత కఠినంగా లేవు, అతన్ని మాట్లాడమని వేడుకున్నాను. దానికి అతను జవాబు చెప్పాడు: "మీకు ఎందుకు చెప్పకూడదో నాకు అర్థమవటంలేదు. మీరిది అర్థం చేసుకోగలరు కూడాను–"

మళ్లీ చప్పున అన్నాడు: "ఏమైనా ఆమెకిది బాగా అర్థమైంది."

"ఎవరూ?" అని అడిగాను.

"నాభార్య! ఆమెకిది బాగా తెలుసు. అందుకనే ఆమెను నేను ద్వేషిస్తాను. ఆమె నాకు ద్రోహంచేసిందానికన్న అధికంగా ద్వేషించేది – ఆమెకు నా వ్యాపారరహస్యం తెలియటమే! భార్య మరో భర్తను సంపాయించటం – అతి సామాన్యమైన విషయమై పోయింది...కాని రెండో విషయంమాత్రం నిజంగా నేరమే!...ఘోరమైన నేరం!"

ప్రతిరాత్రీ చేతులుజాచి చెక్కముందు నిలబడే వ్యక్తీ – అతనిభార్య! ఆమె వయసు నలభై సంవత్సరాలు ఉండొచ్చు. ఆమె అందమైనదనే చెప్పాలి. కాని ఆమె కింది పెదవి లావుగా ఉండటంవల్ల నోరు కాస్త వొంకరగా కనిపిస్తుంది.

అతను కత్తిని విసరబొయ్యేముందు ఆమె వినపడీ వినపడనట్టుగా నవ్వటాన్ని నేను అనేకసార్లు చూశాను. ఆ నవ్వు వింటే - అందులో హేళనా, కఠినత్వమూ తప్పకుండా తోస్తయ్. ఈ కళోపాసికి జవాబుగా - ఆమె తన ప్రమాదాన్ని ద్వేషించటం - ఆ నవ్వులో నాకు తోచింది.

అందుకనే ఆ ముసలివాడు, "మీరు ఆ నవ్వు విన్నారా? నా గూర్చి హేళనగా - ఆ పాపి నవ్వే నవ్వు! నన్నొక పిరికిపందగా గుర్తించిన ఆ నవ్వు! నిజమే - నాది పిరికితనమే! ఆమెకు తెలుసు - తనకు ప్రమాదమేమీ సంభవించదని! కాని ఆమెకు ప్రమాదం సంభవించటమే - తగిన శిక్ష!... కాని నేను ఎంత ప్రయత్నించినా ఆ ప్రమాదాన్ని సృష్టించలేకుండా వున్నాను-" అన్నప్పుడు నేను ఆశ్చర్యపొయ్యాను.

"మీరు ఏం చెయ్యాలనుకున్నారు" అని అడిగాను.

"మీరు గ్రహించలేదా? ఆమెను చంపాలనుకున్నాను."

"చంపటమా? - ఎందుకనీ?"

"ఆమె నన్ను మోసం చేసిందని కాదు. దానికి ఆమెను చాలాకాలం క్రితమే క్షమించాను. అదీకాక ఆమె చేసేపనికి - నేను బాగా అలవాటు పడ్డాను. కాని ఆ మొదటిసారి క్షమిస్తూ ఆమెను నేను భయపెట్టాను. కత్తులు విసిరేప్పుడు కావాలని గురితప్పించి కొట్టి - ప్రమాదవశాత్తూ జరిగినట్టు నటిస్తానని-"

"ఆమెక్కూడా చెప్పారా?"

"చెప్పటమేమిటీ? చెయ్యాలనే చూశాను. నేను ఆ పని చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నై. చెయ్యగలనని కూడా తలిచాను. ఆలోచించండి. అది ఎంత స్వల్పవిషయమో! ఎంత తేలికైందో! అరంగుళంకన్న తక్కువగా గురి చూసివేస్తే ఆమె మెడ తెగి అవతల పడుతుంది. ఈ విధంగా చేస్తే నా కసితీరుతుంది-"

"అది నిజమే- కాని ఘోరం!" అన్నాను.

"నాకేమీ ప్రమాదం ఉండదుకూడాను. ఏదో మామూలుగా ప్రమాదవశాత్తూ జరిగినట్టు పోతుంది. నన్ను ఏవిధంగా నేరస్తుణ్ని చేస్తారు? పైననాకు సానుభూతికూడా చూపుతారు. నేను నా భార్యను గూర్చిన దొంగ ఏడ్పులతో బైట పడతాను. అప్పుడు నాకు సానుభూతి ఉంటుంది కదా?"

"తప్పకుండాను - అందులో సందేహం లేదు."

"ఈ రకంగా కసి తీర్చుకోవటం - మహా అనుకూలం!"

"ఔను-"

"కాని ఆ మాట ఆమెకు చెప్పినప్పుడు ఆమె - నా కోపాన్ని కూడా లెక్క చెయ్యకుండా - ఏమన్నదనుకున్నారు?"

"మీరు దయార్ద్రహృదయులనీ - అంతపని చెయ్యరనీ-"

"ఎబ్బే! కాదు. నేను - మీరు అనుకునేటంత మంచివాణ్ని కూడా కాదు. నాకు రక్తమంటే భయంలేదు. నేను ఆ పనికి వెనుకాడనని ఆమెకు బాగా తెలుసు. మరీ యీ పని-"

"మరి ఆమె భయపడలేదా?"

"లేదు...నేను ఆ పనిని చెయ్యలేనని ఆమె అన్నది. అర్థమైందా?...నేను చెయ్యలేనని-"

"ఎందుకనీ?"

"ఐతే మీకు అర్థం కాలేదన్నమాట. ఎందుకంటారా? ప్రతిరోజూ గంటల తరబడి - ఏళ్లపర్యంతమూ అలవాటు చేసుకున్న యీవిద్యతో - నేను చూడకుండానే గురితప్పకుండా కత్తుల్ని విసరుతున్నానని మీకు చెప్పలా?"

"ఔను-ఐతే-?"

"ఈ ఘోరమైన సాధనఫలితాన్ని ఆమె గ్రహించింది. నా చెయ్యి నా స్వాధీనం తప్పింది. కత్తులు విసిరేప్పుడు గురి తప్పించటం నా చేతులకు సాధ్యమే కాదు-"

"ఇది సంభవమా?"

"ఇంతకన్న నిజంలేదు. ఆమెకు తన క్షేమాన్ని గూర్చిన ధైర్యాన్ని తొలిగిద్దామని - ఆ దుర్మార్గురాలు నాపైచూపే చిన్నచూపును శిక్షిద్దామని ఎన్నోసార్లు ఆమెను చంపాలని నిశ్చయించుకున్నాను. నా బలాన్నంతటినీ ఉపయోగించి కత్తులు పెడమార్గాన విసరుదామని విశ్వప్రయత్నం చేశాను. ఒక్క అరంగుళం పక్కగా కత్తుల్ని విసరగలుగుతే ఆమె చావు నిశ్చయం. ఇది నేను చాలాసార్లు ప్రయత్నించాను. కాని అది నాకు అలివికాని విద్యయిపోయింది. నన్ను గేలిచేస్తూ ఆమె ఎప్పుడూ నవ్వే ఆ వెకిలినవ్వు-"

అతని కళ్లనుంచి నీరుకార నారంభించింది. కోపంతో మూలుగుతూ అన్నాడు; "ఆమెకు యీవిద్యను నేను పట్టుదలతో సంవత్సరాల తరబడి- అలవాటు చేసుకున్న విషయం బాగా తెలుసు. నాకళ అంతరార్థమంతా - నా కన్న ఆమెకే బాగా తెలుసు. ఏ పొరపాటూ కావాలన్నా చెయ్యలేని యంత్రంగా నేను ఎలా తయారయ్యానో ఆమెకు బాగా అర్థమైంది. నేను ఎప్పుడూ గురి తప్పించలేనని ఆమెకు బాగా తెలుసు-"

"ఆఁ" అని నేను ఆశ్చర్యపొయ్యాను.

నిట్టూర్చి అతను అన్నాడు: "ఔను - ఈ విద్య నేర్చుకోవటం మీకు ఎంత కష్టమో - దీన్ని వొదిలించుకోవటం నాకూ అంతకష్టమే!"